క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

అగళి: కోమరేపల్లి పంచాయతీలో ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరగనుంది. ఎంపీడీఓ నరేంద్ర కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఆక్సిజన్ పరికరాల వితరణ



ఆక్సిజన్ ఆటో ఎక్సో మీటర్లు అందించిన కొరియన్ సిబ్బంది

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ సర్వజనా స్పత్రికి కియా సిబ్బంది సోషల్ రెస్పాన్సిబులిటీ కింద ఆక్సిజన్ ఆటో ఎక్సో మీటర్లు అందించారు. శుక్రవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో రూ. 4 లక్షల విలువ జేసే ఆక్సిజన్ ఆటో మీటర్లు హాస్పటల్ కమిటీ మెంబర్ కొండలరాయుడు, వైద్య సిబ్బందికి అందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు మిస్టర్ జోంగ్ వారి మిత్ర బృందం పాల్గొన్నారు. డాక్టర్ శివకుమార్‌స్వామి, బాబాబుడేన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రం



కొలువుదీరిన పీర్లు

పెనుకొండ: పట్టణంలో దర్గా సర్కిల్లో కొడి పీర్ల మకాన్ వద్ద మొహర్రం వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పీర్ల స్వాములను పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఊరేగించారు. భక్తులకు కానుకలు అందజేసి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఆర్బీకేల్లో ఎరువులు, విత్తనాలు

అగళి: మండలంలోని అన్ని ఆర్బీకేల్లో ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నట్లు ఏఓ శేఖర్ తెలిపారు. శుక్రవారం హెచ్‌డీ హళ్లిలోని రైతు భరోసా కేంద్రంలో మండల స్థాయి అగ్రి అడ్వైజరీ బోర్డు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సేవలు, పథకాలను వివరించారు. సర్పంచ్ రామకృష్ణప్ప, నాయకులు కామరాజు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న సహాయ సంచాలకుడు కృష్ణయ్య

పెనుకొండ: పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను ధర్మవరం వ్యవసాయ సహాయ సంచాలకులు కృష్ణయ్య శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక మన గ్రోమోర్ కేంద్రంతో పాటు, శ్రీలక్ష్మీ ఫర్టిలైజర్స్, శివసాయి, రాజేశ్వర ట్రేడర్స్ ఎరువుల దుకాణాల్లో నిల్వ ఉంచిన ఎరువులను పరిశీలించారు. అనంతరం రికార్డులు, ధరల విక్రయం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఓ శివశంకర్‌నాయక్, విస్తరణాధికారి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రీస్కూల్ స్టేషనరీ కిట్ల పంపిణీ

హిందూపురం టౌన్: పట్టణంలోని న్యూ హస్నాబాద్ అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు శుక్రవారం ప్రీ స్కూల్ స్టేషనరీ కిట్లను కౌన్సిలర్ ఆసిఫ్ పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శాంతి, అనిత ఆధ్వర్యంలో కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. కౌన్సిలర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శిశు సంక్షేమ శాఖ అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

అగళి : ఆలుడి చెక్ పోస్ట్ వద్ద డొక్కలపల్లికి చెందిన త్యాగరాజు కర్ణాటక మద్యం తరలిస్తుండగా శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్ఐ లావణ్య తెలిపారు. నిందితుడి నుంచి 384 రాజా విస్కీ ప్యాకెట్లు, కారు స్వాధీనం చేసుకున్నామన్నారు.

పరిగి: ఎర్రగుంటలో కర్ణాటక మద్యం ప్యాకెట్లు అమ్ముతున్న మారెప్ప అనే వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ నరేంద్ర తెలిపారు. అతడినుంచి 190 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఐచర్ వాహనం బోల్తా



అదుపుతప్పి బోల్తాపడిన ఐచర్ వాహనం

పెనుకొండ రూరల్: పెనుకొండ 44వ జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొని ఐచర్ వాహనం శుక్రవారం తెల్లవారుజామున బోల్తా పడింది. స్థానికుల వివరాలు..బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు ఎలక్ట్రానిక్ వస్తువుల లోడుతో వెళ్తున్న ఐచర్ వాహనం..దుద్దేబండ మలుపు వద్దకు రాగానే డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ నిస్సార్ అహ్మద్ గాయపడ్డాడు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి, హిందూపురం సమన్వయకర్త దీపిక



అగళి: గడప గడప కార్యక్రమంలో భాగాంగా ఆలుడిలో మహిళకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి



హిందూపురం: సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న సమన్వయకర్త టి.ఎన్.దీపిక

అగళి: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. శుక్రవారం ఆలుడి గ్రామంలో ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు అందించిన లబ్ధిని వివరించారు. స్థానికులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేక పోవడంతో నీరంతా రోడ్లపైనే నిలిచిపోతున్నాయని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలుచేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు మహిళలు ఆర్థికంగా ఎదగడానికి సీఎం జగన్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. కులమతాలు, వర్గాలు, పార్టీలకతీతంగా అర్హులందరికీ సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా గడప వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, ఆలుడి సర్పంచ్ బసవరాజు, ఎంపీటీసీ సభ్యురాలు నింగమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మంహేద్రప్ప, జేసీఎస్ కన్వీనర్ శివన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రప్ప, కామరాజు, సతీష్, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఘన సన్మానం

మడకశిర: బెంగళూరు రైల్వే డివిజన్ సభ్యుడిగా నియమితులైన ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామిని మడకశిరలోని ఆయన స్వగృహంలో శుక్రవారం కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్లు ఘనంగా సన్మానించారు. డైరెక్టర్లు నాగరాజగౌడ్, అనిత, వైఎస్సార్‌సీపీ నేత వేణుప్రకాశ్ తదితరులు ఎమ్మెల్యే దంపతులను శాలువాతో సత్కరించడంతోపాటు షిర్డీసాయిబాబా ప్రసాదం, ఫొటో అందించారు.

ప్రజా సంక్షేమమే జగనన్న ధ్యేయం

హిందూపురం: ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టిఎన్.దీపిక అన్నారు. కొటిపి పంచాయతీలోని వీరంపల్లి, ఇస్లాంపురం గ్రామాల్లో శుక్రవారం గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందజేశారన్నారు. టీడీపీ నాయకుల కుటుంబాలకు సైతం రూ.లక్షల్లో లబ్ధి చేకూరిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం వచ్చుపోక్కాలకే సంక్షేమపథకాలు ధారధత్తం చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి, సర్పంచ్ సరస్వతి, ఎంపీపీ రత్నమ్మ, వైస్‌ఎంపీపీ రామాంజి, రాష్ట్ర సహాయ కార్యదర్శి హనుమంతరెడ్డి, శ్రీరాంరెడ్డి, ఎంపీటీసీ ధనుంజయరెడ్డి, మంజుల, బసిరెడ్డి, తిప్పేరుద్రయ్య, రాము, సుబ్బిరెడ్డి, ఫైరోజ్, బసప్ప, అదెప్ప, రంగనాథ్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో వస్తువులు దగ్ధం

అమరాపురం: మండల కేంద్రంలోని తమ్మడేపల్లి రోడ్డులో నివాసం వుంటున్న ఎరుకల నాగరాజు ఇంటిలో శుక్రవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో వస్తువులు దగ్ధమయ్యాయి. ఘటనలో టీవీ, ఫ్యాన్, దుస్తులు, తిండి గింజలు కాలిపోవడంతో రూ.40 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

ఓటరు సర్వేకు సహకరించండి



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ కార్తీక్

పెనుకొండ: అన్ని రాజకీయ పార్టీ నాయకులు ఓటరు సర్వేకు సహకరించాలని సబ్ కలెక్టర్ కార్తీక్ పేర్కొన్నారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం రాత్రి అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ సర్వే ప్రారంభమై ఇరవై రోజులు అయ్యిందని, ఇందులో ఏమైనా లోపాలు ఉంటే వెంటనే తెలపాలన్నారు. ఈనెల 21 వరకు సర్వే కొనసాగుతుందన్నారు. డీటీ గణేష్, షాషావలి తదితరులు పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మల సాధికారతకు ఊతం



మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో సున్నా వడ్డీ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో సమన్వయకర్త టీఎన్ దీపిక, డ్వాక్రా సంఘాల మహిళలు

హిందూపురం: పేద అక్కచెల్లెమ్మల సాధికారతకు ఊతం అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరుసగా నాలుగో సారి వైఎస్సార్ సున్నా వడ్డీ పథకానికి శ్రీకారం చుట్టారని హిందూపురం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టిఎన్.దీపిక అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో జరిగిన వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ప్రత్యక్ష ప్రసారం డ్వాక్రా మహిళలతో కలసి ఆమె తిలకించారు. కోనసీమ జిల్లాలోని అమలాపురంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లో నగదు జమ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీపిక మాట్లాడుతూ హిందూపురం మున్సిపాలిటీలోని స్వయం సంఘాల మహిళలకు 4వ విడత వైఎస్సార్ సున్నావడ్డీ కింద రూ.12.49 కోట్లు జమ అయ్యాయన్నారు. ఇచ్చిన మాటను నెరవేరుస్తూ అక్కచెల్లెమ్మల ముఖాల్లో నవ్వుల పువ్వులు వికసింపజేస్తూ సీఎం జగనన్న ప్రజల నీరాజనాలు అందుకుంటున్నారన్నారు. మున్సిపాలిటీలో 2,237 సంఘాల మహిళలు లబ్ధి పొందారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, వైస్‌చైర్మన్లు జబీవుల్లా, బలరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘని, కౌన్సిలర్లు శివ, ఆసీఫ్, షాజియా, పార్వతి, గిరి, మల్లికార్జున, నాగేంద్రబాబు, రామచంద్ర, రోషన్‌అలీ, మణి, రాధమ్మ, నాగేంద్రమ్మ, చిన్నమ్మ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కొటిపి హనుమంతరెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్లు లక్ష్మీనారాయణ, నాగమణి, పార్టీ నాయకులు నాగరాజు, రవీంద్రుడు, రాంమూర్తి, కవిత, చంద్ర, వెంకటేష్ పాల్గొన్నారు.

సున్నావడ్డీతో మహిళల ముఖాల్లో సంతోషం

అమరాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం నాలుగో విడత సున్నా వడ్డీ నిధులను లబ్ధిదారుల ఖాతాలకు శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా అమరాపురం వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ఏపీఎం తిప్పన్న ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సందేశాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ మండలంలోని 1,242 మహిళా పొదుపు సంఘాల్లోని 14,328 సభ్యులకు రూ.1,61,40,689 కోట్లు జమ చేశారన్నారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ ఖాళీ స్థలాలకు టెండర్ల ఆహ్వానం

హిందూపురం టౌన్: ఆర్టీసీ డిపో పరిధిలో హిందూపురం బస్టాండ్, లేపాక్షి, గోరంట్ల బస్టాండ్‌లో ఖాళీగా ఉన్న పక్కా స్టాల్స్, ఖాళీ స్థలాలకు వ్యాపార నిమిత్తం సీల్డు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక డిపో మేనేజర్ ఇన్‌చార్జ్ హంపన్న శుక్రవారం కోరారు. ఈ సందర్భంగా హిందూపురం బస్టాండ్ పరిధిలో పక్కా షాపులు-3, ఖాళీ స్థలాలు 18, మరుగుదొడ్ల నిర్వహణ 1, లేపాక్షి బస్టాండ్‌లో ఖాళీగా ఉన్న పక్కా షాపులు-3, ఖాళీ స్థలాలు-7, గోరంట్ల బస్టాండ్‌లో ఖాళీగా వున్న పక్కా షాపులు-2లకు సంబంధించి టెండరు వేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఈ నెల 16 లోపు ఆర్టీసీ కార్యాలయంలో ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ టెండర్‌ఫారాలు తీసుకోగలరని, ఒక్కొక్కటి రూ.885, లేపాక్షి, గోరంట్ల బస్టాండ్‌లకు సంబంధించిన రూ.295 చెల్లించి టెండర్ ఫారం పొందాలన్నారు. ఈ నెల 17న జిల్లా డీపీటీఓ కార్యాలయంలో సీల్డ్ బాక్సు తెరుస్తామన్నారు.

స్టాళ్ల నిర్వహణకు టెండర్ల ఆహ్వానం

పెనుకొండ: పట్టణంలోని ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో స్టాళ్ల నిర్వహణకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ రామసుబ్బయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రికల్, టూవీలర్ షోరూం, డెయిరీ పార్లర్, ఆటో మెకానిక్ అండ్ సర్వీస్ షాప్, ప్లాస్టిక్ అండ్ ఫైవుడ్ గూడ్స్, కిరాణాషాపు, ఫుట్‌వేర్, ఐస్ స్టోరేజ్ యూనిట్, గోడౌన్, టూవీలర్ స్టాండ్, ఏటీఎం, ఫ్రూట్స్, ఫ్లవర్స్ స్టాళ్ల నిర్వహణకు ఈనెల 17లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 9959229965, 9966737585 నంబర్లలో సంప్రదించాలన్నారు.

'జగనన్న ఆణిముత్యాలు'కు సత్కారం



విద్యార్థినులు, అధ్యాపకులను సత్కరిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో ప్రతిభ కనబరిచి 'జగనన్న ఆణిముత్యాలు'కు ఎంపికైన విద్యార్థినులను శుక్రవారం ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ మురళీమోహన్ అధ్యక్షతన ప్రెషర్స్‌డే, జగనన్న ఆణిముత్యాల సన్మానం, అధ్యాపకులకు సన్మాన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్న ఆణిముత్యాలలో జిల్లా టాపర్‌గా నిలిచిన షాజియా, నియోజకవర్గ స్థాయిలో టాపర్‌గా నిలిచిన గంగోత్రికి జ్ఞాపిక, నగదు బహుమతిని అందజేసి, శాలువా వేసి సత్కరించారు. అలాగే ప్రతి గ్రూప్‌లో టాపర్‌గా నిలిచిన విద్యార్థినులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థినులు విద్యలో రాణించి ఉన్నత స్థానంలో స్థిరపడాలన్నారు. అనంతరం బదిలీపై వెళ్లిన, బదిలీపై కళాశాలకు వచ్చిన అధ్యాపకులను సన్మానించారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సెలవుల్లో ప్రైవేటు పాఠశాలలు నిర్వహించొద్దు

లేపాక్షి: మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలను ప్రభుత్వ సెలవు రోజుల్లో నిర్వహించరాదని ఎంఈఓ నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలవు రోజుల్లో పాఠశాలలను నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

హిందూపురం అర్బన్: ఉన్నత న్యాయ స్థానం ఆదేశాల మేరకు సెప్టెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు అదనపు జిల్లా న్యాయమూర్తి శైలజ శుక్రవారం తెలిపారు. స్థానిక కోర్టు ఆవరణలో జరిగే అదాలత్‌లో రాజీ కాదగిన క్రిమినల్, సివిల్ కేసులతో పాటు ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

మడకశిరరూరల్: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండల శాఖ సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ ముత్యాలప్ప, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి రామకృష్ణ , మండలాధ్యక్షుడు జయరామిరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ గవ్వల రామకృష్ణ, పాల్గొన్నారు.

14 వరకూ వెబ్ ఆప్షన్లకు అవకాశం

మడకశిర: పాలిసెట్–2023 ప్రవేశాలకు సంబంధించిన విద్యార్థులు ఈనెల 14 వరకు ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి అవకాశం ఉందని స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శివకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్లు, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఆప్షన్లు ఇవ్వాలని కోరారు. ఈనెల 16 ఆప్షన్ల మార్పు, ఈనెల 18న సీట్ల కేటాయింపు, 19 నుంచి 23 వరకు కేటాయించిన కళాశాలల్లో విద్యార్థులు రిపోర్టు చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి

పావగడ: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కి కృషి చేస్తానని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ తెలిపారు. తాలూకాలోని కే రాంపురంలో శుక్రవారం ఆయన విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన సాక్షరత గ్రామంగా పేరు పొందిన కే రాంపురం గ్రామం ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తున్న స్వామి జపానంద ఉదారతను కొనియాడారు. స్థానిక కస్తూర్బా పాఠశాల విద్యార్థినుల ఒకే మంచంపై ఒక పెట్టి ఇద్దరు విద్యార్థినులు పడుకోవడం తనను కలచి వేసిందని కన్నీటి పర్యంతమయ్యారు. హాస్టళ్లలో అదనపు గదులు ఏర్పాటు చేస్తానన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 70 మంది విద్యార్థులకు స్వామి జపానంద విద్యా సామగ్రి అందించారు. బీఈఓ అశ్వర్థనారాయణ, శంకరరెడ్డి, నాని, ఎస్ఐ మాళప్ప నాయక్కోడి , రాంపురం నాగేశ్, హెచ్ఎం చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రైతులకు అందుబాటులో ఉండాలి

పెనుకొండ: రైతులు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బందికి జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు ఆవుటాల రమణారెడ్డి సూచించారు. పట్టణంలోని వ్యవసాయ వ్యవసాయ సలహా మండలి సమావేశం కొండలరాయుడు నేతృత్వంలో శుక్రవారం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా రమణారెడ్డి పాల్గొని పలు సూచనలు సలహాలు అందించారు. ఏడీఏ స్వయంప్రభ, ఏఓ శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: ఆర్‌బీకే సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు ప్రభాకర్ సూచించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఏడీఏ అల్తాఫ్‌అలీఖాన్,పశువైద్యాధికారి కిషోర్, విద్యుత్ శాఖ అధికారి వెంకటేశులు, ఇరిగేషన్ ఏఈ నాగరత్న, పట్టుపరిశ్రమ అధికారి శంకర్‌నాయక్, ఏఓ శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హిందూపురం అర్బన్/లేపాక్షి: హిందూపురం పట్టణంలోని రైల్వే రోడ్డులో రోడ్డు విస్తరణకు సంబంధించి విద్యుత్ స్తంభాలు, లైన్స్ షిఫ్టింగ్ చేయడం కోసం శనివారం కరెంట్ సరఫరా నిలిపి వేస్తామని ఏఈ క్రిష్ణవేణి శుక్రవారం తెలిపారు. మెయిన్ బజార్, డీఎల్ రోడ్డు, రైల్వే రోడ్డు, పెనుకొండ రోడ్డు, ముక్కడిపేట, ఆబాద్‌పేట ప్రాంతాలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ, శ్రీకంతపురం, డీఆర్ కాలనీ, డీబీ కాలనీ, మోడల్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. అలాగే లేపాక్షి మండలంలోని శిరివరం సబ్‌స్టేషన్‌లో లైన్ మరమ్మతుల కారణంగా 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వెంకటేశులు శుక్రవారం తెలిపారు.

నామినేషన్ల పరిశీలన

అమరాపురం: నిడ్రగట్ట పంచాయతీలోని 4వ వార్డు సభ్యుని ఎన్నికకు సంబంధించి శుక్రవారం ఆర్‌ఓ భాస్కర్ ఆధ్వర్యంలో నామినేషన్లు పరిశీలించారు. వార్డుకు కెంచమ్మ, తిప్పమ్మ నామినేషన్లు వేశారని, రెండు సరిగా ఉన్నాయని ఆర్‌ఓ తెలిపారు.

అర్హులకు ఇంటి స్థలాలు మంజూరు

సోమందేపల్లి: అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని తహసీల్దార్ సురేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గంగమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. స్థానిక నక్కల గుట్ట కాలనీలో అర్హులకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కొందరు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురాగా, జగనన్న కాలనీలో అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు ఇస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఎంపీపీ గంగమ్మ జెడ్పీటీసీ అశోక్ మాట్లాడుతూ సభ్యుల లేవనెత్తిన సమస్యలు సకాలంలో పరిష్కరించాలన్నారు. వైస్ ఎంపీపీ వెంకటనారాయణ రెడ్డి, సర్పంచ్‌లు ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.


విధుల్లో నిర్లక్ష్యం తగదు

పరిగి: మండలంలోని ఎర్రగుంటలో శుక్రవారం ఎంపీడీఓ సరస్వతి పర్యటించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రం, సచివాలయాన్ని తనిఖీ చేశారు. విధులపై నిర్లక్ష్యం వహించకుండా, ప్రజలకు బాధ్యతాయుతమైన సేవలందించాలన్నారు. సర్పంచ్ బాలకృష్ణ, సెక్రటరీ అరుణ, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌కు ఫిట్స్ వచ్చి ప్రమాదం

గోరంట్ల: పట్టణంలోని చౌడేశ్వరి ఆలయ సమీపంలో శుక్రవారం ప్రధాన రహదారిపై ఆటో నడుపుతున్న రామచంద్రన్ అనే ఆటో డ్రైవర్‌కు ఒక్కసారిగా ఫిట్స్ వచ్చాయి. దీంతో ఆటో రోడ్డు పక్కనే ఉన్న ఇనుప స్తంభాన్ని ఢీకొంది. డ్రైవర్ రామచంద్ర రోడ్డుపై పడ్డారు. డ్రైవరుకు తీవ్ర గాయలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో గోరంట్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఘనంగా మణిద్వీప వర్ణ పూజ



పూజలు నిర్వహిస్తున్న మహిళలు

రొళ్ల: మండల కేంద్రంలో వెలసిన వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం మణిద్వీప వర్ణ పూజ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

కొత్త ఇళ్ల నిర్మాణానికి అనుమతి తప్పనిసరి

మడకశిర: మడకశిర మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా ఇళ్ల నిర్మాణానికి తప్పనిసరిగా ముందుగానే అనుమతి తీసుకోవాలని ఇన్‌చార్జ్ కమిషనర్ రామ్ భూపాల్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. అనుమతి తీసుకోకుండా ఇళ్లను నిర్మించుకుంటే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

సీపీఎం నాయకుల నిరసన

పెనుకొండ: అర్హులకు మడకశిర రోడ్డులోని సర్వే నంబర్ 668 లో ఇంటి పట్టాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద చెవిలో పువ్వు పెట్టుకుని నిరసన తెలియజేశారు. నాయకులు పెద్దన్న, గంగాధర్, వెంకటేష్ హరి, రమేష్, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ల మార్పును సవరించండి

పెనుకొండ: పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఇటీవల విడుదల చేసిన విద్యాశాఖ డివిజన్లలో తప్పిదాలు ఉన్నాయని, వాటిని వెంటనే సవరించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సుధాకర్ శుక్రవారం డీవైఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందించారు.

కాలిగ్రఫీపై ప్రత్యేక శిక్షణ

పరిగి: విద్యార్థులు అక్షరాలను అందంగా రాసినప్పుడే మెరుగైన ఫలితాలు వస్తాయని కొడిగెనహళ్లి ఏపీఆర్ఎస్ఓఈ ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు తెలిపా రు. 5 నుంచి 10వ తరగతి విద్యార్థులందరికీ శుక్రవారం కాలిగ్రఫీపై ప్రత్యేక శిక్షణ తరగతులను ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో ప్రారంభించారు.

స్థలం విషయంలో ఇరువర్గాల ఘర్షణ

గోరంట్ల: మండలంలోని వెంకటరమణపల్లి గ్రామంలో ఎరువు దిబ్బ స్థల విషయంలో చౌడిరెడ్డి, వడ్డే రామచంద్రప్ప వర్గాల మధ్య శుక్రవారం ఘర్షణ జరిగింది. ఇందులో రామచంద్ర వర్గానికి చెందిన సోమశేఖర్‌తోపాటు మరికొందరు గాయపడినట్లు సీఐ సుబ్బారాయుడు తెలిపారు. చౌడిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామచంద్రప్ప, సోముశేఖర్, చలపతి,ఈశ్వరప్ప, వెంకటరమణ, రంగప్ప పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కాగా స్థల వివాదంలో ఇరువర్గాలు ఘర్షణ పడితే వడ్డెర్లపై దాడులు చేస్తున్నారని టీడీపీ నాయకులు ఆరోపణలు చేయడం సరికాదని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు.

గోరంట్లకు చేరిన ట్రైసైకిల్ యాత్ర

గోరంట్ల: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని, విశాఖపట్నం రైల్వే జోన్‌గా ఏర్పాటు చేయాలని శ్రీకాకుళం జిల్లాకు చెందిన ప్రసాద్ అనే దివ్యాంగుడు ట్రైసైకిల్‌యాత్ర చేపట్టాడు. ఇచ్ఛాపురం నుంచి అనంతపురం వరకు చేపట్టిన యాత్ర శుక్రవారం గోరంట్లకు చేరుకుంది. ఈసందర్భంగా ట్రైసైకిల్ యాత్రకు పలువురు సంఘీభావం తెలిపారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



రావుడి సచివాలయ ఆవరణలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి



పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

అగళి: పచ్చదనం పెంచేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. శుక్రవారం నా భుమి–నా దేశం భాగంగా రావుడి సచివాలయ ఆవరణలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనం పెంపుతో వర్షాలు విస్తారంగా కురుస్తాయని, పంటలు బాగా పండుతాయన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. ఉపాధి హామీ, సచివాలయం సిబ్బంది, ఉపాధ్యాయులు,వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అమరవీరులను స్మరించుకుందాం

హిందూపురం: అమరవీరులను స్మరించుకుని ప్రజల్లో దేశభక్తిని పెంపొందించడానికి కృషి చేద్దామని హిందూపురం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టిఎన్.దీపిక అన్నారు. శుక్రవారం మండలంలోని కొటిపి గ్రామ పంచాయతీ జెడ్పీ పాఠశాల వద్ద నా భూమి నాదేశం, నేలతల్లికి వందనం, వీరులకు వందనం కార్యక్రమంలో భాగంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరులను, పదవీ విరమణ చేసిన సాయుధ దళాల అధికారులు, మిలటరీ, పోలీసు అధికారుల సేవలను స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేంద్ర, జెఈ ప్రసాద్, సర్పంచులు సరస్వతి, లలిత, ఎంపీటీసీ ధనుంజయరెడ్డి, కౌన్సిలర్ షాజియా, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కొటిపి హనుమంతరెడ్డి, శ్రీరాంరెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్ నాగమణి, బసిరెడ్డి, రాము, తిప్పేరుద్రయ్య, దేవరాజు, కార్యదర్శులు, స్కూల్‌కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా నా భూమి– నా దేశం

మడకశిరరూరల్/అమరాపురం/రొద్దం/లేపాక్షి/రొళ్ల/పావగడ/గోరంట్ల/పెనుకొండ రూరల్: మడకశిర, అమరాపురం, రొద్దం, లేపాక్షి,రొళ్ల, పావగడ, గోరంట్ల పెనుకొండ మండలాల్లో శుక్రవారం నాభూమి– నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వాతంత్ర సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆనంతరం శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. మొక్కలు నాటి నీరు పోశారు.